"నాలోని దేవుడా?"

"అవును. నువ్వు గుర్తించలేకపోతున్న నీలోని దేవుడు. నీ వెంట వచ్చే మంచిలాగా నీ దేవుడు నీలోనే కాదు నీ పక్కగా ఉంటాడు. నాచేత ఈ యిటుకని తీయించి రాబోయే ప్రమాదాన్ని తప్పించిన భగవంతుడే నన్ను కాపాడే బాధ్యత నీ చేతుల్లో పెట్టాడు. సహజంగా నీలో మంచితనం ఉంది కనుకనే అప్రయత్నంగా నన్ను పట్టుకొని లాగగలిగావు. లేకపోతే జరిగే ఘోరాల్ని చూసే అనేకమంది ప్రేక్షకుల్లో నువ్వూ ఒకడివి అయివుండేవాడివి!"

ఏదో అద్భుతశక్తి తనలో మేల్కొన్నట్టు శ్రీధర్‌కి ఒళ్ళు పులకరించింది.

**-తటవర్తి రామచంద్రరావు**
(న్యూఢిల్లీ)

# నారాయణుడు

వైకుంఠం!

పాలసముద్రం మీద శేషపాన్పుపై పవళించి ఉన్నాడు విష్ణుమూర్తి. లోకపాలనకు ప్రతీకలాగా ఆయన పెదవులపై చిరు మందహాసం నిలిచివుంది. శ్రీమహాలక్ష్మి ఆయన పాదసేవలో లీనమై వుంది. సాక్షాత్తూ ఆ శ్రీనివాసుణ్ణే తనలో నిలుపుకోగలిగినందుకా అన్నట్లు క్షీరసాగరం కించిత్ గర్వంతో గంభీరంగా ఉంది. ఆ జగత్పరిపాలకుని దివ్యనామాన్ని స్మరిస్తూ, ద్వారపాలకులు తమ విధిని నిర్వర్తిస్తున్నారు.

ఇంతలో భూలోకం నుంచి 'శ్రీనారాయణాయ నమః' అని వినిపించింది.

★ ★ ★

రాజారాం వయసు ఇరవై ఏడు సంవత్సరాలు. ఇంకా అతనికి ఉద్యోగం రాలేదు. ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాడు. గవర్నమెంట్ ఉద్యోగానికి వయసు మీరిపోతుండటంతో కంగారుగా ఉంది. చాలా పరీక్షలు రాశాడు. కానీ ఇంతవరకూ ఎందులోనూ సెలక్షన్ మాత్రం రాలేదు. ఇంటా బయటా అపుడే వ్యంగ్య వ్యాఖ్యలు మొదలయ్యాయి. "ఏం చేస్తున్నావు?" అని ఎవరైనా అడిగితే, "ఖాళీగానే ఉన్నాను" అని చెప్పాల్సి వస్తోంది. ఆ ఇబ్బంది అనుభవిస్తేనేగానీ తెలియదు. "పోనీ, ఏ హైదరాబాదో వెళ్లి ఏదైనా కంపెనీలో చేరొచ్చుగా" లాంటి సలహాలు కూడా వినబడుతున్నాయి. "ఆడపిల్లలే ఖాళీగా కూర్చోవటం లేదు గదయ్యా" అని బాబాయ్ వరస వాళ్లు వేళాకోళం చేస్తున్నారు. వీటన్నింటి మధ్యా అతనికి ఫ్రస్ట్రేషన్ మొదలవుతోంది.


అయితే అతను దైవభక్తుడు. ప్రతి పరీక్షముందూ క్రమం తప్పకుండా గుడికి వెడతాడు. ఏవేవో మొక్కులు మొక్కుతాడు. ప్రదక్షిణలు చేస్తాడు. కొబ్బరికాయలు కొడతాడు. కానీ ఇంకా దేవుడు కరుణించలేదు. మళ్లీ రెండు రోజుల్లో పరీక్ష వుంది. అదే ఆఖరిది!

దాంతో విపరీతమైన టెన్షన్‌తో ఉన్నాడు రాజారాం. ఇదిగానీ ఫెయిలైతే ఇక బ్రతుకే శూన్యం అనిపిస్తోందతనికి. అందుకే కన్పడిన దేవుడికల్లా దణ్ణం పెడుతున్నాడు. ఇక పరీక్షకి బయలుదేరేముందు విష్ణుసహస్రనామం చదువుకున్నాడు.

ఆ ప్రార్థనే వైకుంఠంలోని శ్రీమహావిష్ణువుకి వినిపించింది.

"స్వామీ!" పిలిచింది లక్ష్మీదేవి. 'ఏమిట'న్నట్లు చూశాడు విష్ణువు.

"అతడు మళ్లీ మిమ్ములను ప్రార్థిస్తున్నట్లున్నాడు" అంది జగన్మాత. మౌనంగా తల పంకించాడు దేవదేవుడు.



"మీరేమీ పట్టించుకోరేం స్వామీ?"

శ్రీనివాసుని చిద్విలాసం చెరగలేదు. "ఏ విషయంలో దేవీ?" అన్నాడు శాంతంగా.

"అదేమిటి నాథా అలా అంటారు? ఆ కుర్రవాడు ఎంత బాధపడుతున్నాడో చూశారా? ఒక చిన్న ఉద్యోగం కోసం తపించిపోతున్నాడు. మీకు ఎన్నో మొక్కులు మొక్కుతున్నాడు. ఎంతో ప్రార్థిస్తున్నాడు"

తల ఊపాడు కేశవుడు.

"మరి.." అంటూ ఆగింది హిరణ్మయి.

"నేను మాత్రం ఏం చేయను లోకపావనీ?" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది శ్రీమాత. "అతనికో ఉద్యోగాన్ని ప్రసాదించవచ్చుగదా నాథా!" అన్నది.

"ఈ విషయంలో నేను అశక్తుణ్ణి."

"అశక్తులా! సకల చరాచర సృష్టికి కారకులు, పాలకులు. భక్తుల కోరికలు తీర్చే కల్పవృక్షం వంటివారు. బ్రహ్మరాతను కూడా మార్చగలిగే సమర్థులు. మిమ్ములనే నమ్మినవారికి తృప్తిని, ముక్తినీ ప్రసాదించే అసమాన దాతలు! ఇటువంటి మీరు అశక్తులా స్వామీ?"

కేవలం చిరునవ్వు మాత్రంతో లోకాన్ని సమర్థవంతంగా పరిపాలించగలిగే ఆ ఆదివిష్ణువు, క్షీర సముద్రరాజ తనయ అడిగిన ఆ ప్రశ్నకు ఏం సమాధానం చెబుతాడోనని దేవతలందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

శ్రీకరుడు మౌనాన్ని విడనాడుతూ చెప్పాడు "లక్ష్మీ! నీవు చెప్పినవన్నీ వాస్తవములే! అయితే భక్తులు మనఃపూర్వకముగా కోరుకున్నప్పుడే వారి వారి కోరికలు నాచేత తీర్చబడతాయి. మనస్ఫూర్తిగా ఒక కోరిక కోరుకున్న భక్తులు దానిని తీర్చుకొనేందుకు తాము కూడా తమవంతు ప్రయత్నం చేస్తారు. నేను చేసేదల్లా ఆ ప్రయత్నం నెరవేరేటట్లు చేయటమే!

నామీద సంపూర్ణ విశ్వాసం ఉంచి ప్రయత్నించే వారి కోరిక నాచేత తప్పక తీర్చబడుతుంది. అసలంటూ ప్రయత్నమే చేయని వారి విషయంలో నేను కూడా కల్పించుకోలేను.

ఆ రాజారాం విషయంలో ఇదే జరుగుతోంది దేవీ! అతని పరిస్థితికి జాలిపడి నేను ఎన్నో అవకాశాలు ఇచ్చాను. కానీ అతను ఉపయోగించుకోవటం లేదు. ఒక్కరోజు కూడా అతను మనసును కేంద్రీకరించి ఏ పరీక్ష కోసమూ చదువలేదు. కేవలం నాకు మొక్కటం ద్వారానూ, ప్రదక్షిణలు చేయటం ద్వారానూ అతనికి ఏ ప్రయోజనమూ సిద్ధించదు. మానవులు తమ ప్రయత్నం తాము చేయవలసిందే! నిజానికి నాకు ఏ మొక్కులూ అవసరం లేదు. వారి వారి పనులను సవ్యంగా చేస్తే నేను ఎంతో సంతోషిస్తాను. వారిని నిత్యం సంరక్షిస్తూ ఉంటాను. అందుకే శ్రీదేవీ, అతని గురించి నేను అలా చెప్పాను" విష్ణుమూర్తి చెప్పటం ముగించాడు.

విశ్వజనని విభుని వంక అపురూపంగా చూసింది. తన హృదయవాసుడు ఎంతటి అల్పసంతోషో, జీవులను ఎంతగా ప్రేమిస్తాడో అర్థం చేసుకున్న ఆమె, తిరిగి ఆయన పాదసేవలో లీనమైంది.

**-మిత్రా**
(నిజామాబాద్)